సాక్షి
గుంటూరు
బుధవారం ၊ 28 ၊ జూన్ ၊ 2023



కార్తికేయుని సేవలో..

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, వైఎస్సార్ సీపీ నేత కడవకొల్లు నరసింహారావు మంగళవారం దర్శించుకున్నారు.



బాలల రక్షణకు చర్యలు

నెహ్రూనగర్: బాలల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. చైల్డ్ హెల్ప్‌లైన్‌పై జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

రేవతికి రజతం



తెనాలి: నెల్లూరులో జరిగిన పవర్‌లిఫ్టింగ్, బ్రెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో 69 కిలోల విభాగంలో తెనాలికి చెందిన వక్కలగడ్డ రేవతి రజత పతకం సాధించింది. శ్రీషిర్డి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ తరఫున కె.లక్ష్మణబాబు మంగళవారం సత్కరించారు.

న్యూస్‌రీల్

త్రికోటేశ్వరుని హుండీ ఆదాయం రూ.53.05లక్షలు



నరసరావుపేటరూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయానికి హుండీల ద్వారా రూ.53,05,561 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో గొలమూరి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయంలో మంగళవారం హుండీల లెక్కింపు నిర్వహించారు. నరసరావుపేట గ్రూప్–2 ఆలయాల కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటేశ్వరరావు లెక్కింపును పర్యవేక్షించారు. హుండీల ద్వారా ద్వారా బంగారం 24గ్రాములు, వెండి 502గ్రాములు వచ్చినట్టు వివరించారు. హుండీల ద్వారా గతేడాది కన్నా రూ.8,42,366 అధికంగా ఆదాయం లభించినట్టు తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు ముక్కు వెంకటేశ్వరరెడ్డి, తంగేడుమల్లి కెనరా బ్యాంక్ సిబ్బంది, ఆలయ సిబ్బంది, నరసరావుపేట సేవక బృందాలు పాల్గొన్నారు.

యార్డులో 38,969 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 37,400 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 38,969 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,300 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాళకు రూ.9,500 నుంచి 22,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 11,200 నుంచి రూ. 24,700 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 13,072 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 519.80 అడుగుల వద్ద ఉంది. ఇది 148.9116 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి వచ్చే నీటిచేరిక పూర్తిగా నిలిచిపోయింది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 808.70 అడుగుల వద్ద ఉంది. ఇది 33.5776 టీఎంసీలకు సమానం.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

గుంటూరు ఏడీఏ టి.శ్రీనివాసరావు



కొరిటెపాడు(గుంటూరు): నకిలీ విత్తనాలను విక్రయిస్తే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గుంటూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు తోటకూర శ్రీనివాసరావు పేర్కొన్నారు. నగరంలోని పట్నంబజారు, బస్టాండ్, రాజాగారితోట ప్రాంతాల్లోని విత్తన షాపులు, గోడౌన్లలో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గోడౌన్లు, దుకాణాల్లోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను పరిశీలించారు. అలాగే అమ్మకం, కొనుగోలు రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీల్లో అనుమతి లేని రూ.14,31,050 విలువ చేసే 3 వేల మిరప విత్తన ప్యాకెట్లు, 9 ప్రత్తి విత్తన ప్యాకెట్లను గుర్తించారు. ఆయా విత్తనాలకు సంబంధించి సరైన సర్టిఫికెట్లు చూపకపోవడంతో వాటి అమ్మకాలను నిలుపుదల చేశారు. తనిఖీల్లో ఏడీఏలు సీహెచ్ సునీత, సీహెచ్ తిరుమలాదేవి, ఏఓలు బి.అంజిరెడ్డి, బి.కిషోర్, ఐ.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రౌడీయిజంపై ఉక్కు ‘పీడీ’కిలి

రేంజ్ పరిధిలో 22 మందిపై పీడీ యాక్ట్ .. ఇంకో 28 మందిపై పీడీ యాక్ట్ పెట్టనున్నాం

- మరో 1065 మందిపై రౌడీషీట్లు తెరిచేందుకు రంగం సిద్ధం
- పలు కేసుల్లో ఉన్న నిందితులకు శిక్షలు త్వరగా పడేలా చర్యలు
- గంజాయి అమ్మితే ఆస్తుల జప్తు
- విజిబుల్, సాయుధ పోలీస్ పెట్రోలింగ్‌కు ప్రాధాన్యం
- బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే జైలుకే
- రెండు నెలల వ్యవధిలో 20 వేల మందిని కోర్టుకు పంపాం
- ‘సాక్షి’తో గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు



సాక్షి ప్రతినిధి, గుంటూరు, పట్నంబజారు: రౌడీయిజంపై ఉక్కుపాదం మోపుతాం.. ఇప్పటికే రేంజ్ పరిధిలో యాక్టివ్‌గా ఉండే 565 మందిని గుర్తించాం. కేసుల్లో బెయిల్‌పై బయటకు వచ్చి తిరిగి నేరాలు చేసే వారి బెయిల్ రద్దు చేయించాలని పిటిషన్ దాఖలు చేయిస్తున్నాం.. చిన్న, చిన్న నేరాలకు పాల్పడినా ఖచ్చితంగా రౌడీషీట్ తెరుస్తామని గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు హెచ్చరించారు. రేంజ్ పరిధిలోని అన్ని జిల్లాలో రౌడీషీటర్లు, గంజాయి, విజిబుల్ పోలీసింగ్, బహిరంగ మద్యపానం, త్వరితగతిన చార్జిషీట్లు వేసే అంశంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు స్పష్టం చేశారు. గుంటూరు రేంజ్ కార్యాలయంలో మంగళవారం ఆయన ‘సాక్షి’తో ప్రత్యేకంగా మాట్లాడారు.

త్వరితగతిన చార్జిషీట్లు దాఖలు..

రేంజ్ పరిధిలో 565 మంది రౌడీషీటర్లు యాక్టివ్‌గా ఉన్న విషయాన్ని నిఘా వర్గాల ద్వారా తెలుసుకున్నాం. వీటితో పాటు చిన్నాచితక నేరాలు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేసే 1065 మందిపై రౌడీషీట్లు తెరిచేందుకు రంగం సిద్ధం చేశాం. అత్యంత ప్రమాదకర వ్యక్తులుగా ఆయా జిల్లాల వారీగా గుంటూరులో 42, పల్నాడు 62, బాపట్ల 50, ప్రకాశం 48, నెల్లూరులో 70 మందిని గుర్తించాం. అండర్ ఇన్వెస్టిగేషన్ (యూఐ)లో ఉన్న కేసులకు సంబంధించి త్వరితగతిన చార్జిషీట్లు దాఖలు చేసి, నేరం రుజువు చేసి వారిని జైలుకు పంపించే ప్రయత్నాలు చేస్తున్నాం. ఇప్పటి వరకు 22 మందిపై పీడీ యాక్టు అస్త్రాన్ని ప్రయోగించటంతో పాటు మరో 28 మందిపై పీడీ యాక్టు పెట్టనున్నాం. పీటీ వారెంట్లు పెండింగ్, యాక్టివ్‌గా ఉండే రౌడీల బెయిల్ క్యాన్సిల్ చేసి, వారు లోపల ఉండగానే కేసు విచారణ పూర్తి చేయించి శిక్ష పడేలా చర్యలు చేపడతాం.

గంజాయి మూలాలపై గురి..

ముఖ్యంగా గంజాయి విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పూర్తిగా గంజాయి పండించే మండలాల్లో 12వేల ఎకరాలు ధ్వంసం చేసిన పరిస్థితులు ఉన్నాయి. ప్రస్తుతం ఒడిశా ప్రాంతంలోని 22 మండలాల నుంచి గంజాయి వస్తోంది. గతంలో మాదిరిగా గంజాయి విక్రేత దొరికితే వారిని మాత్రమే అరెస్టు చేసి చేతులు దులుపుకోకుండా వారికి గంజాయి ఎక్కడి నుంచి వచ్చిందో కనుక్కుని వారిని అరెస్టు చేయడంతో పాటు, ఎవరికి అమ్ముతున్నారో వారిని కూడా గుర్తించి ఈ కేసుల్లో వారిని కూడా పెడుతున్నాం. మైనర్‌లు, విద్యార్థులు దొరికితే వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ఈ రెండు నెలల కాలంలో గంజాయి విక్రయించే 17 మందిపై పీడీయాక్టులు పెట్టాం, మరో 37 మందిపై పీడీయాక్టులు పెట్టడానికి రంగం సిద్ధం చేస్తున్నాం. ఇకపై కేసులతో సరిపెట్టకుండా గంజాయి విక్రేతల ఆస్తులు, నివాసాలను జప్తు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

బహిరంగ మద్యపానాన్ని ఉపేక్షించం..

ప్రజలు, మహిళలు, యువతలు, విద్యార్థినులకు ఎంతో ఇబ్బంది కలిగిస్తున్న ప్రధాన అంశం బహిరంగ మద్యపానం. దీని ద్వారానే నలుగురు కలిసి తాగి మహిళలను ఇబ్బంది పెట్టడం, వారికి వారే కొట్టుకోవటం, చంపుకోవటం వంటి ఘటనలు ఎన్నో చూశాం. అందుకే బహిరంగ స్థలాల్లో మద్యం సేవించే వారిని కేవలం మందలింపు కాకుండా కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నాం. ఇప్పటికే రెండు నెలల వ్యవధిలో రేంజ్ పరిధిలో దాదాపుగా 20వేల మందిని కోర్టుకు హాజరుపరిస్తే వారికి 3 నుంచి 4 రోజుల శిక్షలు పడ్డ పరిస్థితులు ఉన్నాయి.

ప్రజలకు ధైర్యం కల్పిస్తున్నాం..

అర్ధరాత్రి 12 గంటల సమయంలో సైతం అత్యవసర పరిస్థితుల్లో ఏ ఒక్కరైనా బయటకు వచ్చేందుకు ఎటువంటి సంకోచం లేని పరిస్థితుల కోసమే విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. దీనిలో భాగంగా వాకింగ్ పార్టీ, సాయుధ బలగాలు, నిత్యం రక్షక్ తిరగటం, వెహికల్ చెకింగ్‌తో పాటు డైనమిక్ బీట్ సిస్టంను ఏర్పాటు చేశాం. గతంలో మాదిరిగా ఒక వ్యక్తి దగ్గరకు వెళ్లి బీట్ పుస్తకంలో సంతకం పెట్టి వెళ్లిపోయే పరిస్థితులు కాకుండా, ఎక్కడ నేరం జరిగిందో ఆ ప్రాంతాల్లో ప్రత్యేకంగా బీట్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ బీట్ ద్వారా స్పష్టమైన విధులు కేటాయించి, సిబ్బందిని రంగంలోకి దించి విధులు చేయిస్తున్నాం. నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్న ప్రతి ఒక్కరికి పోలీసు అండగా నిలుస్తాడు.. ఎటువంటి సమస్య వచ్చినా..డయల్ 100, లేకుంటే దగ్గర్లో ఉన్న పోలీసుస్టేషన్‌లకు వెళ్లాలి. ఎటువంటి అవసరం వచ్చినా.. అవసరమైతే నేరుగా నన్ను కూడా నేరుగా కలవ వచ్చని ఐజీ పాలరాజు తెలిపారు.

8న సీఆర్డీఏ పరిధిలో ఇళ్లకు శంకుస్థాపన

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: సీఆర్డీఏ పరిధిలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో వచ్చే నెల 8న శంకుస్థాపన చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ శంకుస్థాపనకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు అధికారులు వివిధ శాఖల సమన్వయంతో నిర్వహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఆర్డీఏలోని ఇళ్ల స్థలాల విషయం ప్రముఖంగా నిలిచిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయడంతోపాటు నిర్మాణాలు నిర్విరామంగా జరిగేట్లు చూడాలని చెప్పారు. ఆప్షన్–3 కింద నిర్మించే గృహాలను కాంట్రాక్టర్లకు మ్యాపింగ్ చేసి బ్యాంకు ఖాతాలు వెంటనే ప్రారంభించాలని సూచించారు. సర్వే కోడ్ జనరేట్ చేసిన లబ్ధిదారులకు ప్లాట్‌లను జియో ట్యాగింగ్ చేయాలని తెలిపారు. లే అవుట్స్ నిర్మాణాలకు సంబంధించిన కావాల్సిన నీటి సదుపాయం, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు, ఇతర మౌలిక సదుపాయాలను ఆయా శాఖాధికారులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ వివరించారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, సీపీఓ శేషశ్రీ, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

వైఎస్సార్ సీపీ హయాంలోనే నగరాభివృద్ధి

- నగరంలో రూ.560కోట్లతో అభివృద్ధి పనులు
- ప్రతిపక్షాల ఆరోపణలు హాస్యాస్పదం
- విలేకర్ల సమావేశంలో నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు

నెహ్రూనగర్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గుంటూరు నగరంలో రూ.560 కోట్లతో అభివృద్ధి జరిగిందని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలియజేశారు. ప్రతిపక్షాలు, వివిధ రాజకీయ పార్టీలు గుంటూరులో అభివృద్ధి జరగలేదని విమర్శలు చేస్తున్న నేపథ్యంలో నగర పాలక సంస్థలోని తన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. మేయర్ మాట్లాడుతూ 11 ఏళ్ల సుదీర్ఘ కాలం తరువాత నగరపాలక సంస్థకు వైఎస్సార్ సీపీ హయాంలో నూతన పాలకవర్గం ఏర్పడిందని, పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచి సీఎం సూచనల మేరకు పార్టీలు, కుల, మతాలకతీతంగా గుంటూరు నగర సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో రూ.217 కోట్లు, పశ్చిమ నియోజకవర్గంలో రూ.240 కోట్లు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో రూ.122 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. గత 10 సంవత్సరాలుగా నగరంలో ఎటువంటి రోడ్డు విస్తరణ పనులు జరగలేదని, వైఎస్సార్ సీపీ హయాంలో పలకలూరు రోడ్డు, నందివెలుగు రోడ్డు, కుగ్లర్ హాస్పటల్ రోడ్డు, రామనామక్షేత్రం రోడ్ల విస్తరణ పూర్తయిందన్నారు. ఏటీ అగ్రహారం, శ్రీనగర్ రోడ్డు, సంజీవయ్యనగర్ నుంచి రెడ్డిపాలెం రోడ్డు, శారదాకాలనీ రోడ్ల విస్తరణ జరుగుతుందన్నారు. గుంటూరు నగరంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి ఏంటో తెలియజేయాలని, బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. అభివృద్ధిపై చర్చలు వదిలేసి ప్రజలను తప్పుదోవ పట్టించేలా టీడీపీ, ఇతర రాజకీయ పార్టీలు నగర అభివృద్ధిపై దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. వీలైనంత త్వరలో గాంధీ పార్కును ప్రారంభిస్తామని, అదేవిధంగా మానస సరోవరంను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.



నగరంలో జరిగిన అభివృద్ధి పనులను మీడియాకు తెలియజేస్తున్న మేయర్ కావటి

నూతన జీవితాన్నిచ్చే ‘న్యూ’రాలజీ!

జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో అధునాతన వైద్యసేవలు

- స్ట్రోక్ యూనిట్, స్లీప్ ల్యాబ్ కల్గిన ఏకైక ప్రభుత్వ ఆస్పత్రిగా గుర్తింపు
- బ్రెయిన్ స్ట్రోక్, ఫిట్స్, జీబీ సిండ్రోమ్ వ్యాధులకు మెరుగైన వైద్యం
- న్యూరాలజీ వైద్యసేవలకు ఐఎస్‌ఓ గుర్తింపు



స్ట్రోక్ యూనిట్‌లో చికిత్స పొందుతున్న రోగులు (ఫైల్)

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో అధునాతన వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నారు. లక్షలాది రూపాయలు ఖరీదు చేసే వైద్యసేవలను ఎంతో మంది పేదలకు ఉచితంగా అందించి ప్రాణాలు కాపాడుతూ అందరి మన్ననలు పొందుతున్నారు. న్యూరాలజీ వైద్య విభాగంలో ఉన్న వైద్య పరికరాలు, వైద్య సౌకర్యాలు రాష్ట్రంలోని ఏ కార్పొరేట్ ఆస్పత్రుల్లో కనిపించవు. దీంతో రోగులు వైద్యసేవలను వినియోగించుకునేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి అధిక సంఖ్యలో వస్తున్నారు.

న్యూరాలజీ వార్డు ప్రత్యేకతలు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఏ ప్రభుత్వ ఆసుపత్రిలో లేనివిధంగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారికి(పక్షవాతం) ప్రత్యేకంగా స్ట్రోక్ యూనిట్ ఉండటం విశేషం. నిద్రలేమి సమస్యలతో బాధపడేవారికి సైతం స్లీప్‌ల్యాబ్‌ను కేవలం గుంటూరు జీజీహెచ్‌లో మాత్రమే ఏర్పాటు చేసి న్యూరాలజీ వైద్యులు రాష్ట్రస్థాయి గుర్తింపు తెచ్చుకున్నారు. న్యూరాలజీ వైద్య విభాగంలో నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నందుకు 2018 జూన్‌లో ఐఎస్‌ఓ 9001- 2015లో గుర్తింపు లభించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఐఎస్‌ఓ గుర్తింపు పొందిన ఏకైక విభాగం న్యూరాలజీ మాత్రమే.

దాతల సహాయంతో ఏర్పాటు..

న్యూరాలజీ వైద్యవిభాగంలో స్ట్రోక్ యూనిట్ ఏర్పాటుకు చిలకలూరిపేటకు చెందిన ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ వారు రూ. 21లక్షలు, గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ కోయ రామకోటేశ్వరరావు రూ.22 లక్షలు, రోటరీ క్లబ్ ఆఫ్ అమెరికా రూ.50లక్షలు మ్యాచింగ్ గ్రాంట్‌ను అందించారు. న్యూరాలజీ వైద్య విభాగంలో 10 పడకలతో స్ట్రోక్ యూనిట్, 10పడకలతో న్యూరో ఐసీయూ ఏర్పా టుకు దాతలు ఎంతో కృషి చేశారు. స్ట్రోక్ యూనిట్ లో 2015 అక్టోబర్ నుంచి వైద్యసేవలను అందిస్తున్నారు. నాట్కో ట్రస్టు రూ.25 లక్షల విరాళంగా అందించడంతో రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా నిద్రలేమి సమస్య బాధితులకు న్యూరాలజీ వైద్య విభాగంలో 2017 జూలైలో స్లీప్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు.

వారంలో మూడు రోజులు ఓపీ వైద్యసేవలు...

మంగళవారం, గురువారం, శనివారం న్యూరాలజీ సంబంధిత సమస్యల రోగులకు ఓపీ విభాగంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్యసేవలను అందిస్తున్నారు. స్ట్రోక్ బాధితులకు క్యాజువాలిటీలో ఎల్లప్పుడు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు.

అరుదైన వ్యాధులకు చికిత్స...

అత్యంత అరుదైన వ్యాధులకు సైతం జీజీహెచ్ న్యూరాలజీ వైద్యులు గుర్తించి చికిత్స అందించి వ్యాధి నుంచి కోలుకునేలా చేస్తున్నారు. పక్షవాతం, మతిమరుపు, పార్కిన్‌సన్స్ వ్యాధి, మధుమేహ న్యూరోపతి, మెడ సంబంధిత సమస్యలు, వెన్నుసంబంధిత సమస్యలు, మల్టిపుల్ సిరోసిస్, వ్యాధి నిరోధకశక్తి లోపం వల్ల వచ్చే వ్యాధులు, కండరాల వ్యాధులు, డేవిక్స్ డిసీజ్, పిల్లల్లో వచ్చే మూర్ఛవ్యాధి, సెరిబ్రల్ పాల్సీ, పీడియాట్రిక్ న్యూరాలజీ సమస్యలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నారు. జీబీ సిండ్రోమ్ వ్యాధి బాధితులకు సుమారు రూ.3 లక్షలు ఖరీదు చేసే ఇమ్యూనోగ్లోబిన్ ఇంజక్షన్లు ఉచితంగా చేయటంతోపాటుగా రక్తమార్పిడి కూడా చేసి ప్రాణాలు కాపాడుతున్నారు.

మూడు గంటల్లోగా ఆస్పత్రికి తీసుకురావాలి...



పక్షవాతం వచ్చినప్పుడు మాట తడబడం, అయోమయంగా మాట్లాడటం, తల తిరగటం, వాంతులు, నడకలో తూలుడు, మూతి, చేయి ఒకవైపునకు ఒంకరపోవటం, దృష్టి మందగించటం, కాళ్లు చేతులు ఉన్నట్టుండి బలహీన పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో రోగి అపస్మారక స్థితి(కోమా)లోకి వెళ్తాడు. బ్రెయిన్ స్ట్రోక్‌వచ్చిన మూడు గంటల్లోపు స్ట్రోక్ యూనిట్‌కు తీసుకొస్తే త్వరగా రోగి వ్యాధి నుంచి కోలుకోవటంతోపాటుగా అంగవైకల్యం సంభవించకుండా కాపాడవచ్చు.

– డాక్టర్ ఎస్.వెంకటసుందరాచారి, న్యూరాలజీ వైద్య విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్

‘గృహ విజ్ఞానం’.. ఉపాధికి మార్గం

హోమ్ సైన్స్ కోర్సులతో ఉజ్వల భవిత

- పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థినులకు సదవకాశం
- బీఎస్సీ ఆనర్స్, బీఎస్సీ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్ కోర్సులు
- విద్యార్థినుల కోసం హోమ్‌సైన్స్ కోర్సులకు ఉమ్మడి జిల్లాలోనే ఏకైక ప్రభుత్వ కళాశాల
- ఇంటర్మీడియెట్ అర్హతతో ప్రవేశాలకు అవకాశం
- జూలై 5 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులకు గడువు



ప్రభుత్వ మహిళా కళాశాలలోని హోమ్ సైన్స్ తరగతిగదిలో విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: డిగ్రీస్థాయిలో అందిస్తున్న హోమ్‌సైన్స్ (గృహ విజ్ఞాన) కోర్సులు విద్యార్థినుల ఉజ్వల భవితకు మార్గం చూపుతున్నాయి. కోర్సు పూర్తికాగానే సత్వర ఉపాధికి విస్తృతమైన అవకాశాలను కల్పిస్తున్నాయి. గుంటూరు నగరంలో ఘనచరిత్ర కలిగిన ప్రభుత్వ మహిళా కళాశాలకు అనుబంధంగా ఉన్న హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 2023–24 విద్యాసంవత్సరానికి డిగ్రీస్థాయిలో బీఎస్సీ ఆనర్స్, బీఎస్సీ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్ కోర్సులను అందిస్తోంది. పూర్తిస్థాయి బోధన వసతులు, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంచే హోమ్ సైన్స్ కోర్సులు ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలతో అత్యుత్తమ బోధన అందిస్తున్నాయి. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థినులు నేరుగా డిగ్రీస్థాయిలో హోం సైన్స్ కోర్సుల్లో చేరేందుకు వీలుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థినులకు ఆయా కోర్సులు ఒక వరమని చెప్పవచ్చు.

బీఎస్సీ ఆనర్స్..

- బీఎస్సీ ఆనర్స్ కోర్సులో చేరేందుకు ఇంటర్మీడియెట్‌లో ఏ గ్రూపునకు చెందిన విద్యార్థినులైనా అర్హులే. 40 సీట్లు కలిగిన ఈ కోర్సును మూడేళ్లపాటు చదివిన విద్యార్థినులకు సాధారణ డిగ్రీ సర్టిఫికెట్ అందజేస్తారు.
- ఒక వేళ నాలుగేళ్లపాటు చదివేందుకు అంగీకరించిన పక్షంలో నాలుగేళ్ల విద్య అనంతరం బీఎస్సీ ఆనర్స్ సర్టిఫికెట్‌ను ప్రధానం చేస్తారు. ఈ విధంగా నాలుగేళ్ల పాటు చదివిన విద్యార్థినులు రెండేళ్ల కాలపరిమితి గల ఎమ్మెస్సీ కోర్సులో మొదటి ఏడాది చదివే అవసరం లేకుండా నేరుగా రెండో ఏడాదిలోకి ప్రవేశం పొందేందుకు అర్హత సాధిస్తారు. పీజీ ప్రవేశ పరీక్షకు హాజరు కావాల్సిన అవసరం సైతం ఉండదు.
- ప్రభుత్వం నిర్ణయించిన విధంగా ఏడాదికి రూ.5,600 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత కలిగిన విద్యార్థినులకు జగనన్న విద్యాదీవెన, హాస్టల్‌లో ఉండి చదువుకునే వారికి వసతి దీవెన మంజూరు చేస్తారు.

బీఎస్సీ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్..

- హోమ్ సైన్సులో మరో కోర్సుగా ఉన్న బీఎస్సీ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్ ప్రవేశం పొందేందుకు ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో ఉత్తీర్ణులై ఉండాలి. మూడేళ్ల కాలపరిమితి గల కోర్సులో 40 సీట్లు ఉన్నాయి.
- ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు రూ.16,500 కాగా ఇదే కోర్సుకు ప్రైవేటు కళాశాలల్లో రూ.35వేలు వరకు వసూలు చేస్తున్నారు. సంబంధిత కోర్సులో చేరిన అర్హులైన విద్యార్థినులకు సైతం నిబంధనల మేరకు విద్యాదీవెన, వసతి దీవెన వర్తిస్తుంది. కళాశాలలో చదువుతో పాటు ప్రముఖ ఆస్పత్రుల సందర్శన, ఇంటర్న్‌షిప్‌నకు అవకాశం ఉంటుంది.

తక్కువ పోటీ.. సత్వర ఉపాధి

- డిగ్రీలో మిగిలిన సంప్రదాయ కోర్సులతో పోలితే హోమ్ సైన్సు కోర్సులకు తక్కువ పోటీ ఉండటంతో సులభంగా సీటు సాధించడంతో పాటు నాణ్యమైన విద్యను అభ్యసించే వీలుంది. విద్య పూర్తి కాగానే సత్వరమే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందవచ్చు.
- ఆయా కోర్సులను పూర్తి చేసిన విద్యార్థినులకు ఆస్పత్రుల్లో డైటీషియన్, డైట్ కౌన్సెలర్స్‌తో పాటు న్యూట్రిషిన్ కన్సల్టెంట్స్, మెడికల్ ట్రాన్స్‌స్క్రిప్షన్‌లో డేటా ప్రాసెసర్లు, ఆహార, ఔషధ ఉత్పత్తి పరిశ్రమల్లో ప్రొడక్షన్ ప్రాసెసర్లుగా ఉద్యోగాలు పొందవచ్చు. ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల్లో ఫీల్డ్ కో–ఆర్డినేటర్స్, ఫ్యాషన్ డిజైనర్స్–ట్రైనర్స్, పాఠశాలలతో పాటు ఒకేషనల్ కళాశాలలో అకడమికీషియన్లుగా, మహిళా శిశు సంక్షేమ శాఖలో వివిధ ప్రభుత్వ ఉద్యోగాలను సాధించవచ్చు.

జూలై 5వ తేదీ వరకు గడువు..

ఆయా కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థినులు జూలై 5వ తేదీలోపు నేరుగా గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలోని హోమ్ సైన్సు విభాగంలో సంప్రదించాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా విద్యార్థినులు టెన్త్, ఇంటర్ మార్కుల జాబితాలు, తమతో పాటు తల్లిదండ్రుల ఆధార్‌కార్డులు, డిజిటల్ సిగ్నేచర్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోను తీసుకెళ్లాలి. హోమ్ సైన్సు కోర్సుల్లో ప్రవేశం పొందగోరు విద్యార్థినులు కళాశాల నుంచే ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా దరఖాస్తులు పంపే అవకాశాన్ని పొందవచ్చు.

ఈ కోర్సులతో ఎంతో ప్రయోజనకరం..




డిగ్రీస్థాయిలో అందిస్తున్న హోమ్ సైన్స్ కోర్సులు విద్యార్థినులకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. ఆయా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థినులు సీసీఈ జాబ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడం ద్వారా సత్వరమే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందవచ్చు. విద్యార్థినుల కోసం జిల్లాస్థాయిలో ఏకైక మహిళా కళాశాల కావడంతో ఆయా ప్రాంతాల నుంచి విద్యార్థినులు ప్రవేశం పొందుతున్నారు. హాస్టల్ వసతి సైతం ఉంది. కళాశాలలో హోమ్ సైన్స్ కోర్సులను అభ్యసించిన పూర్వ విద్యార్థినులు ఉన్నతస్థాయి కొలువుల్లో మంచి వేతనం, గౌరవప్రమైన హోదాలో ఉన్నారు.

– జి. పద్మినీదేవి, హోమ్‌సైన్స్ విభాగాధిపతి

ముఖ్యమంత్రి ఆశయాన్ని నెరవేరుద్దాం

గుంటూరు లీగల్: వైఎస్సార్ లా నేస్తం పథకం ద్వారా ప్రయోజనం పొందిన వారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం మేరకు పేదలకు న్యాయ సహాయం అందించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు క్రాంతి సుదర్శనం, వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల కో–ఆర్డినేటర్ కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2023–24 సంవత్సరానికి మొదటి విడత వైఎస్సార్ లా నేస్తం నిధులను బటన్ నొక్కి అర్హులైన యువ న్యాయవాదుల ఖాతాల్లోకి నగదు జమ చేసిన నేపథ్యంలో మంగళవారం గుంటూరు బార్ అసోసియేషన్ ప్రధాన గేటు ఎదురుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఘనంగా క్షీరాభిషేకం నిర్వహించారు. క్రాంతి సుదర్శనం మాట్లాడుతూ జిల్లాలో 234 మంది న్యాయవాదులకు రూ. 70.20 లక్షలు జమ అయ్యాయని చెప్పారు. కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు ప్రాక్టీస్‌లో నిలదొక్కుకునేందుకు నెలకు రూ.5వేలు చొప్పున మూడేళ్లపాటు ప్రభుత్వం ఆర్థిక చేయూత నివ్వటం అభినందనీయం అన్నారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బార్ కౌన్సిల్ మెంబరు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, జీపీ పోకల వెంకటేశ్వరరావు, ఏపీపీలు శ్యామల, వజ్రాల రాజశేఖరరెడ్డి, మాతంగి శ్రీకాంత్, శివ ప్రసాద్, సుబ్బారావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న న్యాయవాదులు

అభివృద్ధి పనుల్లో చొరవ చూపాలి

కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: సమాజాభివృద్ధిలో భవన నిర్మాణాలు ఎంతో కీలకమని వాటిని సక్రమంగా నిర్వహించడంలో ఇంజినీరింగ్ అధికారులు కీలక భూమిక పోషించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన ఇంజినీరింగ్ అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్మిస్తున్న సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీ భవనాల నిర్మాణాలు మరింత వేగం పెంచాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం, జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో మంజూరు చేసిన పనులు పురోగతిని ప్రతివారం పరిశీలించారు. ఇందులో భాగంగా మంజూరైన కుళాయి కనెక్షన్లు ఏర్పాటుకు మంజూరు చేసిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని చెప్పారు. జగనన్న కాలనీలకు అప్రోచ్ రోడ్లు, అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కాలనీల నిర్మాణంలో అప్రోచ్ రోడ్ల పాత్ర కీలకమన్నారు. పూర్తి చేసిన పనుల తాలూకా బిల్లులు దశల వారీగా అప్‌లోడ్ చేయాలని చెప్పారు. బిల్లులు వెంటనే వచ్చే విధంగా కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో పంచాయితీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, సీపీఓ శేషశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

ఫార్మర్ సైంటిస్టుల ఎంపిక

గుంటూరు రూరల్: నగరంలోని వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం కార్యాలయంలో మంగళవారం ఇండో జర్మనీ గ్లోబల్ అకాడమీ ఫర్ అగ్రలజీ రీసెర్చ్ సెంటర్ నందు ఫార్మర్ సైంటిస్టుల ఎంపిక జరిగింది. ఎంపికలో భాగంగా గుంటూరు జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.రాజకుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్క ఫార్మర్ సైంటిస్ట్ ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు పండించి వారేనని తెలిపారు. తమ పంట పొలంలో పలు పంటల ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడిని సాధించారన్నారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చన్నారు. గ్రామాలు సైతం ఆదర్శగ్రామాలుగా తయారవుతాయన్నారు. ప్రతి రైతు అన్ని రకాల ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని ఫార్మర్ సైంటిస్టులకు సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఫార్మర్ సైంటిస్టులు, టీపీపీ అఖిల్, డీపీపీ సుస్మిత, సిబ్బంది పాల్గొన్నారు.

యువతరం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి


విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, కిరణ్మయిరెడ్డి

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో యువతరం బాధ్యతాయుతంగా ఉండాలని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో మంగళవారం గుంటూరు నెహ్రూ యువకేంద్ర, హిందూ ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త అధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువ ఉత్సవ్-2023 ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. పెయింటింగ్, రైటింగ్, మొబైల్ ఫొటోగ్రఫీ, ఉపన్యాస, సాంస్కృతిక అంశాల్లో పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపట్టాయన్నారు. దేశం పట్ల ప్రతి ఒక్కరు భక్తిభావం కలిగి ఉండాలని, యువతరం తమలోని నైపుణ్యాలను అభివృద్ధి పరచుకుని ప్రతిభను ప్రదర్శించేందుకు ఇటువంటి ఉత్సవాలు చక్కటి వేదికలుగా ఉపయోగపడతాయని చెప్పారు. యువ ఉత్సవ్ థీమ్ ఐన పంచ్ ప్రాణ్ అంశాలను వివరించారు. యువత చేతుల్లోనే దేశ భవిత దాగి ఉందని, వారి శక్తిని మనం సరైన దారిలో ఉపయోగించడం ద్వారా భారత దేశాన్ని అగ్రగామిగా నిలపవచ్చన్నారు. గుంటూరు ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ యువతలోని ప్రతిభను వెలికితీసి వారిలో ఉత్తేజం నింపటంతో పాటు మన దేశ విలువలను, సాంస్కృతిక వారసత్వాలను కాపాడేందుకు ఇటువంటి యువ ఉత్సవాలు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో హిందూ కళాశాల ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ అధ్యక్షురాలు ఈదా నిర్మల, నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి పాల్గొన్నారు.

ఎంబీఏ హాస్పిటల్ బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి వరప్రసాదమూర్తి

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాలలోని ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు బ్రోచర్‌ను మంగళవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ రంగంలో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు మంచి ఉద్యోగావకాశాలు పొందుతున్నారని తెలిపారు. హెల్త్ కేర్ ఇండస్ట్రీ, కార్పొరేట్ హాస్పిటల్స్, వైద్య విద్య కళాశాలలు, ఫార్మసీ, సప్లయ్ చైన్ రంగాలలో ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థులకు దేశ విదేశాలల్లో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాధిపతి డాక్టర్ బి.నాగరాజు మాట్లడుతూ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు ఇతర మనేజ్ మెంట్ కోర్సులకంటే భిన్నమైందన్నారు. ఏపీ ఐసెట్ 2023 లో రాంక్ సాధించిన అభ్యర్థులు కౌన్సెలింగ్ ద్వారా ఈ కోర్సులో సీట్లు పొందవచ్చని తెలిపారు. రెక్టార్ ఆచార్య పి వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి, ఆచార్య పి.సిద్దయ్య, ఆచార్య ఈ.శ్రీనివాసరెడ్డి రీసెర్చ్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి, అంబేడ్కర్ చైర్ అధ్యాపకులు ఆచార్య అబ్రహం లింకన్, ర్యాంకుల కోఆర్డినేటర్ డాక్టర్ బీహెచ్ నాగకిషోర్, ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా, నిజాయితీగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, చిత్రంలో ఏఎస్పీలు సుప్రజ, శ్రీనివాసరావు, మహేష్, కోటేశ్వరరావు

ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తు త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు

నగరంపాలెం: జిల్లాలో విధులు నిర్వర్తించే ప్రతి పోలీస్ అధికార, సిబ్బంది పారదర్శకంగా, నిజాయితీగా ఉండాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో మంగళవారం నేర సమీక్ష సమావేశం జరిగింది. దీర్ఘకాల పెండింగ్ కేసులపై వాకబు చేసి, దర్యాప్తు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లు, జైళ్ల నుంచి విడుదలైన ఖైదీలు, పాత నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉండాలని అన్నారు. పోక్సో, బాలికలు, చిన్నారుల అదృశ్యాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలకు సంబంధించి కేసులను నియంత్రించేలా విధులు నిర్వహించాలని చెప్పారు. ఇటువంటి ఫిర్యాదులు వస్తే నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. గంజాయి రవాణ, విక్రయాలు అరికట్టేందుకు ప్రత్యేక దృష్టిసారించాలని అన్నారు. జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఇప్పటికే పీడీ చట్టం నమోదు చేసినట్లు ఎస్పీ గుర్తుచేశారు. ఇంకా ఎవరైనా ఉన్నట్లయితే గుర్తించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించే ప్రసక్తి లేదన్నారు. చోరీల నియంత్రణకు స్థానిక ఏరియాల్లో గస్తీ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తును త్వరగా పూర్తిగా చేయాలని ఆదేశించారు. పలు కేసులను చేధించిన అధికార, సిబ్బందికి ప్రశంస పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు ఎన్.షేల్కే (గుంటూరు తూర్పు), ఎ.శ్రీనివాసరావు (క్రైం), కె.సుప్రజ (పరిపాలన), డీఎన్.మహేష్ (ఎస్ఈబీ), కె.కోటేశ్వరరావు (ఏఆర్), డీఎస్పీలు సుభాష్ (ఎస్బీ), పోతురాజు (తుళ్ళూరు), ఉమామహేశ్వరరెడ్డి (గుంటూరు పశ్చిమ), జనార్ధన్‌రావు (తెనాలి), విజయశేఖర్ (ఎస్సీ, ఎస్టీ సెల్), చంద్ర శేఖర్‌రావు (ఏఆర్), ఎస్ఈబీ ఏఎస్ కె.మణికంఠ, ఎస్బీ, డీసీఆర్బీ సీఐలు బి.నరసింహారావు, బాల సుబ్రమణ్యం, ఆర్ఐలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. అలాగే ఈనెల 29న బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రత్యేక దృష్టిసారించాలని ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ భాగస్వామ్యంతో విధులు నిర్వహించాలని అన్నారు. జిల్లాలో ఎటువంటి ఘటనలు తలెత్తకుండా పర్యవేక్షణ చేయాలని అధికార, సిబ్బందికి సూచించారు.

విద్యారంగం అభివృద్ధికి విస్తృత రీతిలో కార్యక్రమాలు

- జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ
- జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల కమిటీ సమావేశాలు


మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యారంగాభివృద్ధికి ప్రభుత్వం విస్తృత రీతిలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పేర్కొన్నారు. జగనన్న అమ్మఒడి నాలుగో విడత కార్యక్రమాన్ని బుధవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల కమిటీ సమావేశాలను మంగళవారం నిర్వహించారు. గుంటూరు చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో డీఈవో శైలజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు సకల వసతులను సమకూరుస్తున్న ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. జగనన్న అమ్మఒడి, మన బడి నాడు-నేడు, గోరుముద్ద, విద్యాకానుకతో పాటు 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్స్ పంపిణీ చేస్తున్న విషయాలను గుర్తించాలని సూచించారు. ప్రపంచస్థాయికి తగినట్లుగా ఇంగ్లిష్ మీడియం చదువులతో పాటు స్మార్ట్ డిస్‌ప్లే ప్యానల్స్ ద్వారా ఆధునిక విద్యాబోధన సదుపాయాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు. పాఠశాలల్లో బాల, బాలికలకు వేర్వేరుగా టాయిలెట్లతో పాటు సురక్షితమైన తాగునీటి వసతి కోసం ఆర్వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిందన్నారు. సీబీఎస్ఈ సిలబస్, 3వ తరగతి నుంచి టెన్త్ వరకు సబ్జెక్టు టీచర్లతో బోధన, బాలికల కోసం జూనియర్ కళాశాలలు, డిజిటల్ బోధన, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్స్, స్మార్ట్ టీవీలతో బోధన, బ్యాక్ టు స్కూల్ తదితర కార్యక్రమాలను గురించి వివరించారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

2న జిల్లాస్థాయి కర్రసాము పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): సిలంబమ్ (కర్రసాము) అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కర్రసాము పోటీలు నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షులు వంగ నవీన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను వచ్చే నెల 2వ తేదీ గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసామని చెప్పారు. ఈ కార్యక్రమానికి మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత పాల్గొంటారన్నారు.

మహిళలకు రూ.370 కోట్ల లింకేజీ రుణాలు

గుంటూరు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటనారాయణ



చేబ్రోలు: జిల్లాలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా (మెప్మా) 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి 23 వేల మందికి బ్యాంక్ లింకేజీ కింద రూ.270 కోట్లు రుణాలు మంజూరు చేయాల్సి ఉండగా, లక్ష్యాన్ని అధిగమించి రూ.370 కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు గుంటూరు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్, పొన్నూరు అర్బన్ స్పెషలాఫీసర్ పి.వెంకటనారాయణ తెలిపారు. పొన్నూరు పట్టణంలోని లే అవుట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. జిల్లాలోని 66,125 మంది జగనన్న లే అవుట్ లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు రూ.35 వేల రూపాయల చొప్పున రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు.

క్రికెటర్ అంబటి సేవలు ఎనలేనివి


సెయింట్‌పాల్స్ పాఠశాలలో అంబటితో, చర్చి ఫాదర్ పామిశెట్టి బాలస్వామి, జెడ్పీటీసీ

ఫిరంగిపురం: దేశానికి ఇండియన్ క్రికెటర్ అంబటి రాయుడు ఎనలేని సేవలు అందజేసారని మార్నింగ్ స్టార్ కళాశాల కరస్పాండెంట్, ప్రభుత్వ క్రిస్టియన్ వ్యవహారాల గౌరవ సలహాదారుడు మద్దు బాలస్వామి అన్నారు. మండల కేంద్రంలోని మార్నింగ్‌స్టార్ కళాశాలను ఇండియన్ క్రికెటర్ అంబటి రాయుడు సందర్శించారు. విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు అంబటి సమాధానాలు ఇచ్చారు. అనంతరం ఫాదర్ బాలస్వామి క్రికెటర్ అంబటి రాయుడిని సన్మానించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో సమాజానికి సేవలందించేలా కృషిచేయాలని చెప్పారు. అనంతరం మండలకేంద్రంలోని తూర్పు బజారులోని మేనమామ కొలగాని రవికుమార్ నివాసానికి నేషనల్ ఇండియన్ క్రికెటర్ అంబటి రాయుడు వచ్చారు. అమీనాబాద్ గ్రామంలోని మూలాంకురేశ్వరి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఫిరంగిపురంలోని బాలఏసు దేవాలయంలో కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవాలయ విచారణ గురువులు బాలస్వామి, సహాయవిచారణ గురువులు అనిల్‌కుమార్‌లు అంబటిని ఆశీర్వదించారు. అనంతరం సెయింట్ పాల్స్ హైస్కూల్‌లోని విద్యార్థులతో కొద్దిసేపు రాయుడు ముచ్చటించారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ క్రికెటర్ అంబటి రాయుడిని శాలువా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో కె.చిన్నప్పరెడ్డి, డి.సురేష్ కుమార్, కె.రవికుమార్, బాబురావు, ఎస్.సాంబశివరావు, కె.రామారావులు ఉన్నారు.

మాతృ మరణాలపై సమీక్ష


సమీక్షిస్తున్న డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు

గుంటూరు మెడికల్: మాతృ మరణాలు సంభవించకుండా జిల్లాలో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు అన్నారు. మంగళవారం గుంటూరు డీఎంహెచ్ఓ చాంబర్‌లో డీఎంహెచ్ఓ అధ్యక్షతన జిల్లా మాతృమరణాల సమావేశం జరిగింది. సమావేశంలో మంగళగిరి ఇందిరానగర్, నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పానుగుపాడు, పొన్నూరు ఇందిరానగర్ ప్రాంతాల్లో సంభవించిన మూడు మాతృమరణాలపై కమిటి సభ్యులు సమీక్ష నిర్వహించారు. మరణాలకు కారణాలపై ఆరా తీసి మూడు మరణాల్లో రెండు నివారించలేనివిగానూ, ఒకటి నివారించదగిన మాతృమరణంగా కమిటీ సభ్యులు నిర్ధారించారు. మరణాలు సంభవించకుండా ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు నిత్యం గర్భిణులను పర్యవేక్షించాలన్నారు. వారికి బీపీ, షుగర్, గుండెజబ్బు వ్యాధులు ఉన్నాయో లేవో పరీక్షలు చేయించాలని చెప్పారు. తరచుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పరీక్ష కోసం తీసుకెళ్లి, ప్రమాదకరమైన లక్షణాలున్న వారిని జిల్లాస్థాయి ఆసుపత్రులకు తరలించి నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, జిల్లా లెప్రసి అధికారి డాక్టర్ సుబ్బారావు, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అన్నపూర్ణ, ఎన్‌హెచ్‌ఎం డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, డాక్టర్ అరుణ, డాక్టర్ సుశ్మిత, డాక్టర్ రాధికారాణి, డాక్టర్ ఆదిత్య ప్రదీప్‌రెడ్డి, డాక్టర్ వింధ్య పాల్గొన్నారు.